

తవ్వకాల కలకలం

లుకలాంలో తవ్వకాలు కలకలం రేపుతున్నాయి. స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో



వైశాఖ సందడి

అరసవల్లిలో వైశాఖ సందడి నెలకొంది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

- 8లో

మాకివలసలో పబ్లిక్‌గా లాటరీ

నరసన్నపేట: మండలం మాకివలసలో పబ్లిక్‌గా లాటరీ ఆట నిర్వహిస్తున్నారు. ఆదివారం మరింత శ్రుతి మించినట్లు సమాచారం. అసిరమ్మ తల్లి పండగల సాకుతో ఆకతాయిలు ఇలా చేస్తున్నారు. అలాగే పండగ ఖర్చులకు గ్రామానికి రూ.10 లక్షలు ఇవ్వడానికి లాటరీ నిర్వాహకులు అంగీకరించినట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల అండతోనే ఆ లాటరీ ఆటలు అవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

న్యూస్‌రీల్

50 ఏళ్ల తర్వాత బేసి పోలమ్మ అమ్మవారి సంబరాలు



బేసి పోలమ్మ అమ్మవారు

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రాపురం గ్రామంలోని బేసి పోలమ్మ అమ్మవారి గ్రామ దేవత సంబరాలు సోమవారం నుంచి మొదలుకానున్నాయి. తొమ్మిది రోజుల పాటు సంబరాలు నిర్వహించనున్నారు. యాభై ఏళ్ల తర్వాత గ్రామంలో ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. 5 నుంచి 13వ తేదీ వరకు ప్రతి రోజూ రాత్రి 9 గంటల తర్వాత గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 5న రాజమండ్రి వారి డ్యాన్స్ ఈవెంట్స్, 6న ఒడిశా వారి సాంస్కృతిక కార్యక్రమాలు, 7న కండక్టర్ ఝాన్సి, రమేష్ మాస్టర్ స్టేజ్ ఈవెంట్స్, 8న ఒరియా రామాయణం, 9న పల్సర్ బైక్ రమణ ఈవెంట్స్, 10న ప్రకాష్ మాస్టారు గ్రూప్ డ్యాన్స్‌లు, 11న విశాఖపట్నం రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా, 12న బుల్లెట్ భాస్కర్ టీమ్ జబర్దస్త్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జోగిపోలమ్మ సిరిమాను పండగలు



పరశురాంపురం గ్రామంలో జోగిపోలమ్మ ఆలయం



జోగిపోలమ్మ అమ్మవారు

టెక్కలి: టెక్కలి మండలం పరశురాంపురం గ్రామంలో సోమవారం నుంచి గ్రామదేవత జోగిపోలమ్మ సిరిమాను పండగలు జరగనున్నాయి. దశాబ్దాల తర్వాత నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సర్పంచ్ కోరాడ కామేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు దేవర ఉత్సవంతో పాటు 13వ తేదీ సిరిమాను సంబరం, అమ్మవారి ఘటాల ఊరేగింపుతో 9 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. దశాబ్దాల తర్వాత నిర్వహిస్తున్న ఉత్సవాల కోసం సుదూర ప్రాంతాల నుంచి బంధువులంతా గ్రామానికి చేరుకోవడంతో సందడి చోటు చేసుకుంది. ఉత్సవాలతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.




ఆర్‌జీయూకేటీ ప్రాంగణం

● ట్రిపుల్ ఐటీ..

భవిష్యత్‌కు గ్యారెంటీ

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఈ నెల 20 చివరి తేదీ
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రవేశాల్లో వెయిటేజ్
- ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సు చదివే అవకాశం
- రెసిడెన్షియల్ విధానంలో విద్య
- మంచి ప్లేస్‌మెంట్లు సాధిస్తున్న రిలీవైన విద్యార్థులు



ఎచ్చెర్ల క్యాంపస్:

ట్రిపుల్ ఐటీ సందడి మొదలైంది. పదో తరగతి తర్వాత అధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఎదురుచూసే అవకాశమిది. ఈ సంస్థలో పేద, మధ్య తరగతి విద్యార్థులు చేరేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేక వెయిటీజీ ఇవ్వడమే దీనికి కారణం. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్లు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందుతున్నారు. ట్రిపుల్ ఐటీలో చేరితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్ముతున్నారు.

రాష్ట్రంలో నాలుగు ట్రిపుల్ ఐటీలు ఉన్నాయి. శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ప్రకాశం. శ్రీకాకుళం విద్యా సంస్థలో 1100 సీట్లు ఉన్నాయి. ఏటా 60 శాతం దాటి బాలికలు సీట్లు సాధిస్తున్నారు. ట్రిపుల్ ఐటీలో సమీకృత ఇంజినీరింగ్ కోర్సు ఆరేళ్లు. రెండేళ్ల పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్సు), నాలుగేళ్లు ఇంజినీరింగ్. పీయూసీ పూర్తయిన విద్యార్థులు ఇంజినీరింగ్‌లో చేరుతారు. నూతన విద్యా విధానం-2020 మేరకు పీయూసీ పూర్తిచేసిన విద్యార్థులు రిలీవ్ కావచ్చు. ఇంజినీరింగ్ విద్యార్థులు సైతం ఏటా రిలీవ్ కావచ్చు. విద్యార్హత బట్టి ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఇంజినీరింగ్‌లో సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, సీఎస్ఈ, ఈసీఈ వంటి బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. రిలీవ్ అయ్యే విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లు సాధించటంతో పాటు గేట్ వంటి ర్యాంకులు సాధించి ఉన్నత విద్య సైతం చదువుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో మెరుగైన ఉద్యోగాలు సాధిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ..

2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఏప్రిల్ 27 వ తేదీ నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. ఈ నెల 20 చివరి తేదీ. జూన్ ఐదున ఎంపికైన విద్యార్థుల మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారు. 11 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూన్ 30 నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభించి అకడమిక్ ఏడాది ప్రారంభిస్తారు. 10వ తర గతి మార్కులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వెయిటేజీ, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. దివ్యాంగులు, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్, వంటి ప్రత్యేక కేటగిరీలకు నూజివీడు క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఆర్‌జీయూకేటీలో ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తాం. మంచి భవిష్యత్ ఉంటుంది. రిలీవ్ నాటికి మంచి ప్లేస్‌మెంట్‌లు లభిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎక్కువగా ప్రవేశాలు లభిస్తున్నాయి. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. పూర్వపు విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఆన్‌లైన్‌లో గడువు లోగా దరఖాస్తులు చేసుకోవాలి.

– ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్



శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ మెయిన్ గేట్

రెసిడెన్షియల్ పద్ధతిలో..

పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో విద్యా బోధన ఉంటుంది. అర్హులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తారు. పీయూసీకీ రూ.45 వేలు, ఇంజినీరింగ్‌కు రూ.50 వేలు ఏడాదికి ట్యూషన్ ఫీజు. ఇతర తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ప్రవేశం పొందితే రూ. 1.50 లక్షలు ఏడాదికి ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు ఆంధ్రా విశ్వవిద్యాలయం పరిధిలో 17 జిల్లాలకు 65.62 శాతం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో 9 జిల్లాలకు 34.38 శాతం సీట్లు కేటాయించి ప్రవేశాలు నిర్వహిస్తారు.

మొగదాలపాడు హెచ్‌ఎం సస్పెన్షన్

గార: వత్సవలప పంచాయతీ మొగదాలపాడు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతాడ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఎంఈఓ-1 నక్క రామకృష్ణ తెలిపారు. పాఠశాలలోని 6,7,8 తరగతులకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు చైల్డ్‌లైన్‌కు సమాచారమివ్వడంతో అధికారులు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. విద్యార్థినులు ఇచ్చిన సమాచారం వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేశారు.

రేషన్ అందిందోచ్



సవర సార్లిగాం గ్రామంలో గిరిజనులకు రెండు నెలల రేషన్ అందజేస్తున్న అధికారులు

- నవరసార్లిగాం గ్రామంలో గిరిజనులకు రెండు నెలల రేషన్ అందజేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి: టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సవరసార్లిగాం గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలకు ఆదివారం రెండు నెలల రేషన్ సరుకులు అందజేశారు. గ్రామానికి చెందిన రేషన్ కార్డుదారుల నుంచి వేలిముద్రలు వేయించుకుని రేషన్ ఇవ్వకపోవడంపై 'వేలిముద్రలు వేయించుకున్నారు...రేషన్ ఎగ్గొట్టారు' అనే శీర్షికతో ఈ నెల 3వ తేదీన సాక్షిలో కథనం వెలువడింది. దీంతో అధికార యంత్రాంగం స్పందించింది. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, వీఆర్‌ఓ భానుమూర్తి తదితరులు సవర సార్లిగాం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం ఏప్రిల్, మే నెలకు సంబంధించి రేషన్ సరుకులను అందజేశారు. రాదు అనుకున్న రేషన్ అందడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేలిముద్రలు వేయించి రేషన్ ఇవ్వకపోవడంపై సంబంధిత డీలర్‌పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం

భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం



భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: భగీరథ మహర్షి దివి నుంచి భువికి గంగను తెచ్చిన మహానుభావుడని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు అన్నారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మరుగునపడిన వారి జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.అనురాధ, బీసీ సంక్షేమ శాఖ జాతీయ కార్యదర్శి డాక్టర్ బి.దేవభూషణరావు, ఉప్పర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరామారావు, సెక్రటరీ గజ్జల మాధవ రావు ఉపాధ్యక్షులు పిండి రాము, కలెక్టరేట్ ఏఓ సూర్యనారాయణ, బీసీ వెల్ఫేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల క్యూ

● ప్రశాంతంగా ముగిసిన

నీట్

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్(నీట్) ప్రశాంతంగా ముగిసింది. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల కేంద్రంలో 480 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరయ్యారు. దీంతో 469 మంది పరీక్ష రాశారు. సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి అవస్థలు పడ్డారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కణితి శ్రీరాములు సీఎస్‌గా వ్యవహరించి పర్యవేక్షించారు.

ఎచ్చెర్ల క్యాంపస్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశ పరీక్ష నీట్-2025 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో 720 మంది విద్యార్థులకు 713 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. కుశాలపురం పరిధి శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 240 మంది వద్యార్థులకు 233 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లోనికి 11.30 నుంచి విద్యార్థులను అనుమతించారు. మధ్యాహ్నం రెండు గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఉదయం 11 గంటలకే పరీక్ష కేంద్రాలను చేరుకున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ట్రిపుల్ ఐటీ ఏఓ ముని రామకృష్ణ, డీఎస్పీ వివేక నంద, తహసీల్దార్ బి.గోపాలరావు పరీక్షలు పర్యవేక్షించారు.



పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు



ట్రిపుల్ ఐటీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, ట్రిపుల్ ఐటీ ఏఓ ముని రామకృష్ణ



పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న దృశ్యం



పురుగు బారిన పడి నేలకొరిగిన కొబ్బరి మొక్కలు

ఆనవాలే ఉండదు.. ఆయుష్షు మిగలదు

చెట్లపై దాడి చేస్తున్న ఎర్ర ముక్కు పురుగులు



చెట్టుకు రంధ్రం చేసిన ఎర్రముక్కు పురుగులు

- ఉద్దానం కొబ్బరిని ఆశిస్తున్న ఎర్రముక్కు పురుగు
- నేలకొరుగుతున్న కొబ్బరి మొక్కలు
- పచ్చగా కనిపిస్తూనే పాడైపోతున్న వైనం
- సామూహిక సస్యరక్షణే మేలు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్దానం కొబ్బరిపై ఎర్ర ముక్కు పురుగు పంజా విసురుతోంది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిత్లీ తుఫాన్‌కు నేలకొరిగిన కొబ్బరి చెట్ల ప్రాంతంలో రైతులు కొబ్బరి మొక్కలు నాటారు. మొక్కలు పెరుగుతున్న సమయంలో ఎర్రముక్కు పురుగు ఆశిస్తుండటంతో పచ్చగా కనిపిస్తూనే కొబ్బరి మొక్కలు నేలకొరుగుతున్నాయి. దీంతో కొబ్బరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పురుగు అన్ని వయస్సుల కొబ్బరి చెట్లను, తోటలను ఆశిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. కొబ్బరి చెట్ల మొవ్వులో రంధ్రాలు చేసి, చెట్టు మరణానికి కారకాలుగా మారుతున్నాయి. మొక్కకు ఎర్ర ముక్కు పురుగు ఆశించినప్పటికీ చెట్టు పచ్చగానే ఉంటుండటంతో రైతులు త్వరగా మేలుకోలేకపోతున్నారని, కొబ్బరిదిగుబడి తగ్గడం, కొద్ది రోజుల తరువాత చెట్టును నష్టానికి గురిచేస్తుందని ఉద్యానవన అధికారులు చెబుతున్నారు.

ఆనవాలు లేకుండానే..

చెట్టు లోపలి భాగంలో ఆవాసం ఏర్పాటు చేసుకున్న ఎర్రముక్కు పురుగు అక్కడే సంతానోత్పత్తి చేసి ఆరోగ్యకరంగా ఉన్న కొబ్బరి చెట్టును నాశనం చేస్తుంది. చెట్టు నేలకొరిగే వరకు రైతు ఎలాంటి ఆనవాలు పసిగట్టలేకపోవడంతో నష్టపోతున్నాడు. దీంతో ఏడాదికి ఎకరానికి నాలుగైదు చెట్లను రైతు కోల్పోతున్నాడు. లేత కొబ్బరి చెట్లకు ఇది ఎక్కువ నష్టాన్ని కలగజేస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలకే ఆశ్రయిస్తోంది

ఏడాదిన్నరగా సరైన వానలు లేకపోవడంతో కొబ్బరి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం కొబ్బరి తోటల్లో నాటిన కొబ్బరి మొక్కలు పురుగు బారిన పడి నేలకొరుగుతున్నాయి. దీంతో కొత్త మొక్కలు తయారు చేయాలంటే భయంగా ఉంటోంది.

– దున్న రవి, కొబ్బరి రైతు, బూర్జపాడు, ఇచ్ఛాపురం మండలం

రైతులకు తెలియకుండానే..



కొబ్బరి చెట్టుకు ఎర్రముక్కు పురుగు ఆశించినట్లు రైతు గ్రహించలేకపోతాడు. చెట్టు ఆరోగ్యకరంగా ఉంటూనే నేలకొరుగుతోంది. ఈ పురుగుల నివారణపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం. ఈ పురుగుల్ని రూపుమాపాలంటే రైతులంతా సమష్టిగా సామూహిక సస్యరక్షణ చేపట్టాలి.

– పి.మాధవీలత, మండల ఉద్యానవన అధికారి, కవిటి

లక్ష్యానికి దూరం..

- జిల్లాలో తగ్గిన ఉపాధి పనులు
- లక్ష్యాలకు దూరంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు



శ్రీకాకుళం పాతబస్టాండ్:

పేదలకు దినసరి వేతనం కల్పించి, వలసల నివారణకు ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో తగ్గుతోంది. ఈ పనులను నమ్ముకుని ఉన్న వేతనదారులకు న్యాయం జరగడం లేదు. అధికారులు-సిబ్బంది కుమ్ములాట, వ్యక్తిగత ప్రతిష్టలు ఈ శాఖలో మిగులుతున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో కూలీలకు న్యాయం జరగడం లేదు. ఒక పక్క అధికారుల అసమర్థత, మరో పక్క ప్రభుత్వం విధానాలతో ఈ పనులు మందగిస్తున్నాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పనులపై ఆసక్తి చూపడం లేదు.

ఒకప్పుడు జిల్లా రాష్ట్రస్థాయిలోనే పనుల కల్పనలో మొదటి, ద్వితీయ స్థానాల్లో ఉండేది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, వేతనదారులకు పనిదినాల కల్పన, వేతనాల చెల్లింపులు, మెటీరియల్ కాంపోనెంట్ జనరేషన్‌లో గుర్తింపు పొందింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ఫలితాలు దిగువ స్థాయికి చేరాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం కాంపోనెంటు మొత్తంలో మాత్రమే మూడో స్థానంలోకి చేరారు. మిగిలిన ప్రమాణాల్లో జిల్లా వెనుకబడిపోయింది.

ఆర్థిక సంవత్సరం లక్ష్యాలు

2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక ప్రక్రియలో అంచనా విలువ రూ.1499.03 కోట్లుగా వేశారు. మొత్తం 41,523 పనులను గుర్తించారు. ఈ పనుల్లో భాగంగా గోశాల నిర్మాణం, సేద్యపు నీటి కుంటలు, సమతల, రింగు, కాంటూరు కందకాలు, కాలువలు, చెరువులు, పశువులకు నీటి తొట్టిలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్, చేపల చెరువులు, వరద కట్టలు, మట్టి రోడ్లు, భూ అభివృద్ధి పనులు, మినీ పెర్కొలేషన్ ట్యాంక్‌లు, హౌసింగ్ లబ్ధిదారులకు 90రోజులు పనిదినాలు, సరోవరాలు, కోనేరులు పూడిక తీత, పల్లె పుష్కరిణిలు తదితర పనులు చేపట్టేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.

నాడు-నేడు

అంశం	2020-21 (వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న మొదటి ఏడాది)	2024-25 (టీడీపీ అధికారంలో ఉన్న మొదటి ఏడాది)
జిల్లాకు బడ్జెట్	రూ. 2.68 కోట్లు	రూ. 2.01 కోట్లు
పనిచేసిన కుటుంబాలు	4.37లక్షలు	3.36 లక్షలు
వ్యక్తిగతంగా పనిచేసిన వారు	7.07 లక్షలు	4.94 లక్షలు
దివ్యాంగులు	10305	6757 మంది



క్లుప్తంగా

దర్గాలో చందనోత్సవం



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చౌక్‌బజారు దర్గాలో హజరత్ సయ్యద్ రోషన్ షావళిబాబా రహమతుల్లా షరీఫ్ చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. బాబా సమాధికి గంధం పూసి పూలదండలతో అలంకరించి చాదర్ కప్పి ఖురాన్ పఠించారు. షేక్‌సలీం సోదరుల ఆధ్వర్యంలో లంగర్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జామియా మసీదు ప్రతినిధులు షాన్, రఫీ, బాషా, అహమ్మద్, నజీరుద్దీన్, వహబ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి అనుమానాస్పద మృతి



మరణించిన వ్యాపారి పూన నాగరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మూడు రోడ్ల కూడలిలో ఉన్న ఓ దుకాణం అరుగుపై విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడు స్థానిక వ్యాపారి పూన నాగరాజుగా గుర్తించి కుటుంబానికి తెలియజేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



సింహాచలం (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం జరజాం సమీపంలో బైపాస్ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతిచెందాడు. బైక్ నడుపుతున్న అడపా సింహాచలం (39) ఆస్పత్రికి తీసుకెళ్లేలోగానే మృతి చెందిన విషయం తెలిసిందే. వెనుక కూర్చున్న బాలి సింహాచలం (64) తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అత్యవసర చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో రణస్థలం మండలం వేల్పురాయి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఆవుదూడ మృతి



మృతి చెందిన ఆవుదూడ

పొందూరు: మండలంలోని తండ్యాం గ్రామంలో కుక్కల దాడిలో ఆదివారం ఉదయం లంకలపల్లి వెంకటరావుకు చెందిన ఆవుదూడ మృతి చెందింది. రైతు తన కల్లంలోని ఏడాది వయస్సు కలిగిన ఆవుదూడను కట్టి ఇంటికి వెళ్లే సరికి కుక్కలు గుంపు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామపెద్ద భాస్కరరావు పొందూరు పశుసంవర్ధకశాఖ ఏడీకి సమాచారం ఇవ్వడంతో వైద్యులు వచ్చి చికిత్స చేసినా అప్పటికే దూడ మృతిచెందింది. కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'కూర్మ'లో వేసవి శిక్షణ శిబిరాలు

హిరమండలం: ఆధ్యాత్మిక గ్రామం కూర్మలో యువతకు వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయని వర్ణాశ్రమ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకూ శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. భారత సనాతన సంస్కృతిని నెలకొల్పడం, స్వయం సమృద్ధి సాధించడం, పూర్వపు వృత్తులను పునరుద్ధరించాలన్న లక్ష్యంతో చేనేత, గానుగ ఆడింపు, మట్టికుండల తయారీ, వడ్రంగి, కర్రసాము, వైదిక గృహనిర్మాణం, ప్రకృతి వ్యవసాయం, మంత్ర ధ్యానం, శ్రవణం, కీర్తనం, వైదిక జీవనం ప్రాముఖ్యత, రసాయనాలు లేని ఆహారం, శాస్త్ర అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన తదితర అంశాల్లో యువతకు శిక్షణ ఇస్తామని వివరించారు. 15 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించాలని, సెల్‌ఫోన్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యుత్‌తో పాటు ఇతరత్రా ఆధునిక సదుపాయాలేవీ ఉండవని, సరళం, సహజం, సంప్రదాయకం, ధార్మిక జీవనం కోసమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాలకు 7732075607, 8712011776 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లుకలాంలో.. తవ్వకాల కలకలం

- తాగునీటి ప్రాజెక్టు సమీపంలోనే ఇసుక తవ్వకాలు
- ఆందోళన చెందుతున్న స్థానికులు



లుకలాం తాగునీటి ప్రాజెక్టు సమీపంలో ఇసుక తవ్వకాలు

నరసన్నపేట : ఉచితం విధానం పేరిట వంశధార నదిలో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. నదిలో తమకే హక్కులు ఉన్నాయన్న చందంగా నది మొత్తం జేసీబీలతో గుల్ల చేసేస్తున్నారు. మంజూరు చేసిన విస్తీర్ణానికి మించి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. చెంతనే తాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయని కూడా చూడకుండా ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. దీంతో లుకలాం గ్రామస్తులతో పాటు నరసన్నపేట మండలవాసులు ఆందోళన చెందుతున్నారు. లుకలాంలో అధికారికంగా ఇసుక ర్యాంపు ఇవ్వకపోయినా ఎదురుగా శ్రీకాకుళం రూరల్ మండలం బట్టేరు ర్యాంపునకు అధికారులు అనుమతులిచ్చారు. వారికిచ్చిన పరిధిని దాటి నదిలో నరసన్నపేట మండలం లుకలాం వైపు వచ్చి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. నదీ గర్భాన్ని ఛిద్రం చేసేస్తున్నారు. ఎక్కడికక్కడ గోతులు పెట్టి జేసీబీలతో ఇసుకను తవ్వి లారీలతో తరలిస్తున్నారు.



లుకలాం తాగునీటి ప్రాజెక్టు ఫిల్టర్

మిగిలిన ప్రాంతం మాట ఎలా ఉన్నా లుకలాం వద్ద ఉన్న రక్షిత మంచినీటి ప్రాజెక్టుకు సమీపాన భారీ ఎత్తున తవ్వకాలు చేస్తున్నారు.

తాగునీటి సరఫరాకు ముప్పు..

ఇక్కడి తాగునీటి ప్రాజెక్టు నుంచి 18 గ్రామాలకు నీరు సరఫరా అవుతుంటుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టును రూ.7 కోట్లతో నిర్మించారు. అప్పట్లో 30 గ్రామాలకుపైగా తాగునీరు సరఫరా అయ్యేది.. ప్రస్తుతం 18 గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అప్పట్లో నీటి ఫిల్టర్లు నదిలో నిర్మించారు. ఇప్పుడు వీటికి దగ్గర్లోనే ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో నీటి కొరత ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి ప్రాజెక్టుకు ఇబ్బంది..

వంశధార నదిలో శ్రీకాకుళం రూరల్ మండలం బట్టేరు ఇసుక ర్యాంపు నిర్వాహకులు తమ పరిధిని దాటి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. నరసన్నపేట మండలం లుకలాం వైపు వచ్చి ఇసుక తవ్వేస్తున్నారు. రూ.7 కోట్లతో నిర్మించిన తాగునీటి ప్రాజెక్టు సమీపంలోనే తవ్వకాలు జరుపుతుండటంతో గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో నీటి ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉంది.

– ఎస్.తవిటినాయుడు, సర్పంచ్, లుకలాం

తవ్వకాలు ఆపాలి..

తాగునీటి ప్రాజెక్టు సమీపంలో ఇసుక తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలి. ఇదే విధంగా తవ్వకాలు జరిగితే లుకలాంతో పాటు మరో 18 గ్రామాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదముంది. ముందుగానే అధికారులు మేల్కొని తగు చర్యలు తీసుకోవాలి.

– చింతల సత్యం, మాజీ సర్పంచ్, లుకలాం

అరసవల్లిలో వైశాఖ సందడి



ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేస్తున్న భక్తులు



అరసవల్లి ప్రధాన మార్గంలో స్తంభించిన వాహనాలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ మాసం సందడి మొదలైంది. పవిత్ర వైశాఖ మొదటి ఆదివారం కావడంతో స్థానికులతో పాటు ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతరాలయంలో ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుడు సర్వదర్శనాలకు అనుమతించేలా ఆలయ అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో తగు చర్యలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకోగా మరికొందరు భక్తులు ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఇంద్ర పుష్కరిణిలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సంప్రదాయ పూజలు ఆశ్రయించారు. పంటల తొలిఫలాలను స్వామివారికి ప్రత్యేక ప్రసాదంగా నివేదించారు. పుష్కరిణి ప్రాంతంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ఈవో కె.శోభారాణి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేసినప్పటికీ కేశఖండనశాల, ఉచిత దర్శనాల క్యూలైన్లు తదితర చోట్ల భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది.

ఒక్క రోజు ఆదాయం రూ.10.38లక్షలు..

వైశాఖ మొదటి ఆదివారం సందర్భంగా ఒక్కరోజులో రూ.10,38,252 ఆదాయం లభించిందని ఆలయ ఈవో కె.శోభారాణి ప్రకటించారు. వివిధ దర్శన టికెట్ల విక్రయాల ద్వారా రూ.7.36 లక్షలు, విరాళాలు, పూజలు ద్వారా రూ.98,252, లడ్డూ, పులిహోర విక్రయాల ద్వారా రూ.2.04 లక్షల వరకూ ఆదాయం లభించినట్లు వివరించారు.

ట్రాఫిక్‌జామ్..

అరసవల్లి ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం ట్రాఫిక్ స్తంభించింది. గార, శ్రీకాకుళం నుంచి వాహనాల రాకపోకలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో సుమారు గంట సేపు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అనంతరం అసిరి తల్లి ఆలయం పక్క నుంచి దేవాలయ తోట వరకూ వాహనాలను దారి మళ్లించారు.

వివాహేతర సంబంధానికి ఇద్దరు బలి

ఎచ్చెర్ల క్యాంపస్: వివాహేతర సంబంధం రెండు ప్రాణాలను బలిగొంది. ఎచ్చెర్ల మండలం కొయ్యాం పంచాయతీ పాతకూర్మినాయుడుపేటలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన కొయ్యాన లోకేష్ (25) తాతగారి గ్రామం పాతకూర్మినాయుడుపేటలో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన జీరు మంగమ్మ (31)తో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. లోకేష్ అవివాహితుడు కాగా, మంగమ్మకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నిరోజులుగా ఇద్దరికీ మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో లోకేష్ ఆదివారం వేకువజామున గ్రామ సమీపంలోని కొబ్బరితోటలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితితో ఉన్న ఈయన్ను స్థానికులు గుర్తించి, ఆస్పత్రికి తీసుకువెళ్లేలోగానే మృతి చెందాడు. ఈ విషయం మంగమ్మకు కూడా తెలియడంతో తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన మహిళ వద్ద సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివాహేతర సంబంధం కారణంగానే ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

పందెంరాయుళ్ల అరెస్టు

రణస్థలం: మండలంలోని కోటపాలెం కొబ్బరితోటల్లో ఆదివారం సాయంత్రం కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని జె.ఆర్.పురం పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి కోడి, రూ.2వేలు నగదు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

లెఫ్టినెంట్ వేణుకు ఘన స్వాగతం



వేణుగోపాల్‌కు స్వాగతం పలికిన మిత్రులు

కవిటి: ఉద్దానం ప్రాంతం గొండ్యాలపుట్టుగ అనే పల్లెలో పుట్టి చిన్న వయసులోనే నేవీ లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగోన్నతి పొందిన దుద్ది వేణుగోపాలరావుకు ఆదివారం బాల్యమిత్రులు, యువత ఘనస్వాగతం పలికారు. వేణుగోపాలరావు ఇటీవల అసిస్టెంట్ లెఫ్టినెంట్ స్థాయి నుంచి లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందిన తర్వాత తొలిసారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభ కాంక్షలు తెలియజేశారు. తన పట్ల ఇంత అభిమానాన్ని చూపిన మిత్రులకు వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

ధ్రువపత్రాలు సిద్ధమేనా..



విద్యార్థులు

- కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లకు ఇదే సమయం
- విద్యాసంస్థల్లో ప్రవేశాలు నేపథ్యంలో ముందస్తుగా సిద్ధం కావడం మేలు



కుల ధ్రువపత్రం

హిరమండలం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ తదితర పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. ఉన్నత చదువుల్లో భాగంగా కళాశాలల్లో చేరేందుకు పలు ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటినిముందస్తుగా పొందేందుకు ఇదే మంచి తరుణమని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో రానున్న విద్యార్థుల కోసం సంబంధిత కార్యాలయాల్లోనూ అవసరమైన అన్ని పత్రాల అందజేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒత్తిడి పెరగకముందే..

సాధారణంగా మే, జూన్ నెలల్లో ముఖ్యంగా తహసీల్దార్ కార్యలయాల్లో సిబ్బందిపై ధ్రువపత్రాల జారీకి సంబంధించి అధిక ఒత్తిడి ఉంటుంది. దరఖాస్తుదారుల రద్దీ పెరుగుతుంటుంది. వీఆర్వో, ఆర్‌ఐల క్షేత్ర స్థాయి పరిశీలన, డిజిటల్ సంతకాలు తదితర పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్యాలయాలకు పలుమార్లు తిరగాల్సిరావడం, మధ్యవర్తులను ఆశ్రయించడం వంటి ఇబ్బందులు రావచ్చు. ఫలితంగా అనుకున్న సమయానికి ధ్రువపత్రాలు చేతికి అందకపోవచ్చు. ముందుగా మేల్కొంటే హైరానా తప్పుతుందని అధికారులు చెబుతున్నారు.

ధ్రువపత్రాలు పొందాలంటే..

- ప్రస్తుతం చదువుతున్న క్లాసుల నుంచి తదుపరి తరగతుల్లో ప్రవేశానికి ఆదాయం, కులం, ఈడబ్ల్యూస్, ఓబీసీ వంటి ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటి కోసం మీ–సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.
- ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలతో సంబంధిత అర్జీ పూర్తిచేసి అవసరమైన నకలను జతపర్చి సచివాలయం డిజిటల్ సహాయకుడికి అందజేయాలి.
- ఆన్‌లైన్‌లో పొందపరిచిన వివరాలపై వీఆర్వో క్షేత్ర స్థాయిలో, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)నేరుగాను పరిశీలిస్తారు. అన్నీ పక్కాగా ఉంటే చివరిగా తహసీల్దార్ తన లాగిన్‌లో మరోసారి నిశితంగా పరిశీలించి డిజిటల్ సంతకం చేస్తారు. దీనిపై మొబైల్‌కు వచ్చే సందేశంతో దరఖాస్తుదారులు సచివాలయంలో గానీ, మీసేవా కేంద్రంలో గానీ ధ్రువపత్రాలు పొందవచ్చు

దరఖాస్తు చేసుకోండి..



కళాశాలలు, వృత్తి విద్యా కోర్సుల్లో చేరే సమయంలో అవసరమయ్యే ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుంటే మేలు. చివరి సమయంలో హడావుడి పడుతూ ఆందోళన చెందకుండా ప్రస్తుత సెలవుల్లోనే కార్యాలయాలను సంప్రదించాలి. కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీకి నిర్దేశించిన సమయం కంటే ముందు వీటిని జారీచేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.హనుమంతురావు, తహసీల్దార్, హిరమండలం

బారువలో బారులు తీరిన పర్యాటకులు



బారువ తీరంలో పోటెత్తిన పర్యాటకులు

బారువ తీరంలో ఆదివారం నిర్వహించిన బీచ్ ఫెస్టివల్‌కు పర్యాటకులు పోటెత్తారు. ఉత్సవం చివరి రోజు కావడంతో స్థానికులతో పాటు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, ఒడిశా నుంచి వేలాది సంఖ్యలో పర్యాటకులు బారువ తీరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద, సాంస్కృతిక ప్రదర్శనలు, ఫైర్ షో, ముగింపు వేడులు ఆకట్టుకున్నాయి. బోట్‌రైడింగ్ వంటి కార్యక్రమాలతో చిన్నారులు సందడి చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

– సోంపేట



ఆకట్టుకున్న సైకత శిల్పం



బోటులో షికారు చేస్తూ..



జాతీయ జెండాతో మెరైన్ అడిషనల్ ఎస్పీ జి.బి.ఆర్ మధుసూదనరావు, సిబ్బంది

నేడు ఏపీటీఎఫ్ ధర్నా

శ్రీకాకుళం న్యూకాలనీ : ప్రభుత్వ పాఠశాలల సంరక్షణకు ఉపాధ్యాయులంతా సమష్టిగా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పాలకులు, అధికారులు చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం పాత తాలూకా కేంద్రాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ నెల 9న కలెక్టరేట్ వద్ద ధర్నా, 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నాకు పెద్ద ఎత్తున ఏపీటీఎఫ్ ప్రతినిధులు, మండల శాఖ ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అ'పూర్వ' సమ్మేళనం



జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

– రణస్థలం

ఉద్యాన పంటలకు రాయితీ రెట్టింపు

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): జిల్లాలో 44250 హెక్టార్లలో ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా 155147 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని రైతులు సాధిస్తున్నారని జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘ తీరప్రాంతమున్న, వివిధ జీవవైవిధ్య పరిస్థితులు నెలకొని ఉన్న జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక విస్తరణ పథకాలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ సంవత్సరం నుంచి ప్రోత్సాహకాలను గణనీయంగా పెంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ పంటలను వేయదలుచుకునే రైతులను ఉద్యాన అధికారులు గుర్తించారని, తొలకరి వర్షాకాలానికి ముందే మిగిలిన రైతులని కూడా గుర్తించేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ పథకంలో ప్రత్యేకంగా డ్రాగన్ ఫ్రూట్ పంటకు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం భారీగా పెంచిందన్నారు. గతంలో హెక్టారుకు రూ.30వేలుగా ఉన్న రాయితీని ఇప్పుడు రూ.1.62లక్షలకు పెంచడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రైతు సహాయక కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

అఖిల భారత సమ్మె విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న చేపట్టనున్న అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, ప్రజా సంఘాల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాలు కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి, మరింత శ్రమదోపిడీ చేసేందుకు, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేసేందుకు, పని గంటలు పెంచడానికి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.వెంకటరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మణికొండ ఆదినారాయణమూర్తి, బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ నాయకుడు ఎం.గోవర్ధనరావు, రైతు సంఘం నాయకుడు కొత్తకోట అప్పారావు, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పార్వతీశం, రిమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాకోటి చిన్నారావు, ఏపీ మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు టి.ప్రవీణ, పద్మ, కళాసీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బోర చిన్నారావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.